ప్రజలను సురక్షితంగా ఉంచుతాం

• డిప్యూటీ కమిషనర్ గోధుమల రాజు • 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన

మీతో సాక్షి

మల్కాజిగిరి: అకాల వర్షాలతో పాటు వాతావరణంలో మార్పులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు 'సాక్షి' సోమవారం మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గోధుమల రాజుతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది.

◆ ప్రజల నుంచి ప్రశ్నలే కాకుండా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి 'సాక్షి' ప్రశంసలు అందుకుంది. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా తెలుసుకున్న సమస్యలను ఆయా విభాగాల ద్వారా సత్వరం పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగరాజు, ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జున్, ఎంటమాలజీ విభాగం అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ వనజ, ఈఎఫ్ఏ నజీరుద్దీన్, హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, ఏఈ దివ్యజ్యోతి, ఏఎమ్‌సీ దయానంద్ పాల్గొన్నారు.

వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేస్తున్నారు..

◆ దయానంద్‌నగర్ ఇంటి నెంబర్ 20-80/4 సమీపంలో చెత్త తీసుకొచ్చి పారవేస్తున్నారు. దీనివల్ల అపరిశుభ్ర వాతావరణంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– దాసరి కొండయ్య, దయానంద్‌నగర్

డీసీ: సిబ్బందిని పంపించి చెత్తను తొలగిస్తాం. అక్కడ కొన్ని రోజులు నిఘా ఉంచుతాం. ప్రజలు కూడా బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయకుండా స్వచ్ఛ కార్మికులకు అందజేయాలి.

వరదనీటితో ఇబ్బంది పడుతున్నాం..

◆ హనుమాన్‌పేట్ బస్టాప్‌కు సమీపంలో కృపా టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు దెబ్బతినడంతో వర్షాకాలంలో వరదనీరు నిలుస్తుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురౌతున్నారు.

–ఏవీ స్వామి, హనుమాన్‌పేట్

డీసీ: ఎమర్జెన్సీ టీమ్‌తో గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరిస్తాం.

దోమల బెడద అధికంగా ఉంది..

◆ ఇందిరానెహ్రూనగర్‌లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఫాగింగ్ చేయడం లేదు. మురుగునీరు కూడా నిలుస్తుంది.

– లక్ష్మణ్, ఇస్మాయిల్ హుస్సేన్, సుభాష్, ఇందిరానెహ్రూనగర్

డీసీ: ఎంటమాలజీ విభాగం సిబ్బంది చేత ఫాగింగ్ చేయిస్తాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి.

తైబజార్‌తో ట్రాఫిక్‌జామ్..

◆ గీతానగర్ ప్రాంతంలో ప్రతి బుధవారం తైబజార్ నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్‌తో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, పాఠశాలలు ఉన్నాయి. తైబజార్‌పై తగిన చర్యలు తీసుకోవాలి.

– గీతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్

డీసీ: గతవారం వ్యాపారులకు అవగాహన కల్పించాం. తైబజార్ ఏర్పాటు చేయకుండా సిబ్బందిని ఏర్పాటు చేశాం. కాలనీవాసులు కూడా ముందుకురావాలి. వ్యాపారులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయం పరిశీలిస్తున్నాం.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాల పారబోత..

◆ చెత్తను కాలనీలోని బహిరంగ ప్రదేశాల్లో పారవేస్తున్నారు. దీనివల్ల దోమల బెడద ఎక్కువైంది.

–సత్యవతి, దీన్‌దయాళ్‌నగర్

డీసీ: వ్యర్థాలు పారవేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోండి..

◆ దోమల బెడద ఎక్కువగా ఉంది. చెరువుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోండి.

–మురళి, ఓల్డ్ నేరెడ్‌మెట్

డీసీ: ఫాగింగ్ చేయిస్తాం. చెరువుల పరిరక్షణకు కూడా చర్యలు తీసుకుంటాం.

చెట్లకొమ్మలను వదిలేశారు..

◆ విద్యుత్ విభాగం అధికారులు కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి అక్కడే వదిలేశారు. గౌరీశంకర్ అపార్ట్‌మెంట్ నుంచి దీన్‌దయాళ్‌నగర్ వరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– రఘువీర్, కాకతీయనగర్

డీసీ: చెట్ల కొమ్మలను తొలగిస్తాం. అవసరమైతేనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం.

మురుగు సమస్యను పరిష్కరించండి..

◆ సీఫెల్ కాలనీలో డ్రైనేజీ సమస్య కారణంగా మురుగు సరిగ్గా వెళ్లడం లేదు. అదే ప్రాంతంలో పాఠశాల కూడా ఉంది. దీంతో విద్యార్థులతో పాటు కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– సుభాష్, సీఫెల్ కాలనీ అధ్యక్షుడు

డీసీ: మురుగు సమస్యపై ఇంజినీరింగ్ విభాగంతో చర్చించి నాలా సమస్యను పరిష్కరిస్తాం. దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.



డీసీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

గుంతలమయంగా రోడ్లు..

◆ విశాల్‌మార్ట్ వద్ద రోడ్డు బాగా దెబ్బతింది. చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

–లక్ష్మారెడ్డి, నేరెడ్‌మెట్

డీసీ: వర్షాకాలం కాబట్టి తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మత్తులు చేపడతాం.

డ్రైనేజీ డైవర్షన్‌కు చర్యలు తీసుకోవాలి..

◆ సఫిల్‌గూడ చెరువులో సమీప కాలనీల్లో నుంచి కొంతమంది మురుగు వదులుతున్నారు. వారిని గుర్తించి అవగాహన కల్పించి, డ్రైనేజీ డైవర్షన్‌కు చర్యలు తీసుకోవాలి.

– శ్రవణ్, గీతానగర్

డీసీ: మురుగునీటిని వదిలే వారిని గుర్తించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. డ్రైనేజీ డైవర్షన్‌కు తగిన చర్యలు తీసుకుంటాం.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారు..

◆ మల్లికార్జుననగర్ స్ట్రీట్ నెంబర్ 4 నుంచి 8 వరకు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారవేస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డు మీదకు చేరుతుంది. దీనివల్ల దోమలబెడద, అనారోగ్యానికి గురౌతున్నాం. – శ్రీనివాస్, మల్లికార్జుననగర్

డీసీ: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారవేరబోసే వాళ్లకు అవగాహన కల్పిస్తాం. అవసరమైతే జరిమానా విధిస్తాం. దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

నిర్మలారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డితో ఎమ్మెల్యే బండారి

కాప్రా: టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఉప్పల్, నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఆయా ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సాయిజెనోశేఖర్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కుషాయిగూడ: కుషాయిగూడ శ్రీ మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి వాసవి మిత్రమండలి అధ్యక్షుడు పెద్ది నాగరాజుగుప్తా ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని, ప్రతి అమావాస్యరోజు పేదలకు అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. మారుతీ మిత్రమండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్‌చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హన్మంతు, మచ్చ బాబు, ఆంజనేయులు, సతీష్, గోపాల్‌రెడ్డి, గోపాల్‌చారి, నర్సింగ్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

సిటీలో మ్యాట్రెసెస్‌ల ఉచిత పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: మన దేశపు కంఫర్ట్ టెక్ బ్రాండ్.. ది స్లీప్ కంపెనీ ఆధ్వర్యంలో నగరంలో పరుపుల(మ్యాట్రెసెస్) ఉచిత పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. తమ ఆఫర్‌లో భాగంగా జూబ్లీహిల్స్, కొండాపూర్, కోకాపేట్, కార్ఖానాలలోని తమ టీఎస్‌సీ స్టోర్స్‌ను సందర్శించిన 1500 మంది నుంచి 100 మంది విజేతలను ఎంపిక చేసి వారికి పరుపులు, దిండ్లు ఉచితంగా అందించామని, వీటి విలువ సుమారు రూ.25 లక్షల వరకూ ఉంటుందని వివరించారు.

గీతానగర్‌లో తైబజార్ తొలగించండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి గీతానగర్‌లో ప్రతి బుధవారం ఏర్పాటు చేస్తున్న తైబజార్‌ను తొలగించాలని గీతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు మొదట ఈ ప్రాంతంలో తైబజార్ లేకుండా ఉండేదని కొంతమంది నాయకులు తైబజార్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాంతంలో మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రితో పాటు రెండు ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తైబజార్ ఏర్పాటుతో రోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూరగాయల వ్యర్థాలు అక్కడే పారవేస్తున్నారని దీనివల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. చిరువ్యాపారులకు తాము వ్యతిరేకం కాదని, ప్రజలకు ఇబ్బంది లేనిచోట స్థలాన్ని కేటాయించాలని డీసీని కోరామన్నారు.

ఇత్తడిని పుత్తడిగా నమ్మించి మోసం..

నిందితుల రిమాండ్





నిందితులు ఓంకార్, వాసు



ఉప్పల్: ఇత్తడిని పుత్తడిగా నమ్మించి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సోమవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను నడిపిస్తున్న కాపీ నరేందర్ వద్ద శ్రీకాకుళంజిల్లా వజ్రపు కొత్తూరు మండలానికి చెందిన ఓంకార్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన స్నేహితుడు వాసును ఓంకార్ పరిచయం చేశాడు. కొద్దిరోజుల తర్వాత ఇద్దరు కలిసి నరేందర్‌ను మోసం చేయాలని భావించి, దుబాయి నుంచి తెచ్చిన బంగారు బిస్కెట్లు ఉన్నాయని నమ్మబలికి, పథకం ప్రకారం.. ముందుగానే బిస్కెట్‌కు ఒక పక్క బంగారం అతుకు పెట్టిన బిస్కెట్‌ను తీసుకొచ్చి నరేందర్ ఎదుటే కత్తిరించి బంగారు ముక్కను ఇచ్చారు. దీంతో బంగారమే అని నమ్మి, రూ 8,95,000 నగదును ఇచ్చాడు. అనంతరం అనుమానం వచ్చి మరోసారి చూసుకోగా.. నకిలీ బిస్కెట్ అని తేలడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు ఆగస్టు 9న సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధి కావడంతో కేసును వారు ఆగస్టు 25న ఉప్పల్‌కు బదిలీ చేశారు. దర్యాప్తు ప్రారంభించిన ఎస్సై రఘురాం నిందితులు వాసు, ఓంకార్‌లను అదుపులోకి తీసుకుని రూ.5 లక్షల నగదు, రెండు నకిలి బిస్కెట్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విహారికా కాలనీలో పర్యటిస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌పరిధిలో 10,15,16 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో మేయర్ అమర్‌సింగ్ పర్యటించారు. సోమవారం స్థానిక కాలనీల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా వృద్ధులు, మహిళలు, అత్యవసరమైతే తప్పా బయటికి రావొద్దని సూచించారు. తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని మేయర్ ప్రజలను కోరారు. అత్యవసర పరిస్థితిలో పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 9154999303, ఎలక్ట్రిసిటీ కంట్రోల్‌రూమ్ నెంబర్ 9491039018 నెంబర్లు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని మేయర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి రవీందర్, బండి సతీష్‌గౌడ్, వీరమల్ల సత్యనారాయణ, పీర్జాదిగూడ మున్సిపల్ అధికారులు డీఈ సాయినాథ్‌గౌడ్, కార్పొరేషన్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జ్వరపీడిత నిరుపేదలకు లయన్స్‌క్లబ్ ఆర్థిక చేయూత



సాక్షి, హైదరాబాద్: ఇంటింటికి గంపలో పండ్లు తీసుకెళ్లి విక్రయించే నేరేడ్‌మెట్‌కు చెందిన అనూరాధ కుటుంబంలో ఐదుగురు జ్వరాల బారిన పడ్డారు, తాజాగా ఆమె మనవరాలు టైఫాయిడ్ జ్వరం సోకింది. అంతా కష్టపడితే గాని పూటగడవని ఆ కుటుంబం ఇప్పుడు పూట గడవటమే కష్టంగా ఉంది. ముందులు కొనేందుకు కూడా మార్గం లేక అల్లాడుతోంది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా జ్వరాలు చుట్టుముట్టడంతో ఇలాంటి నిరుపేద వర్గాల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఏరోజు సంపాదనతో ఆ రోజు నెట్టుకొచ్చే పేద కుటుంబాలను జ్వరాలు అల్లకల్లోలం చేస్తున్నాయి. ఒకరి నుంచి ఒకరికి సోకే వైరల్ జ్వరాలతో.. కుటుంబ సభ్యులంతా ఆసుపత్రి పాలు కావాల్సి వస్తోంది. ఇలాంటి నిరుపేదలకు లయన్స్ క్లబ్ సభ్యులు అండగా నిలుస్తున్నాయి. సోమవారం నగరానికి చెందిన లయన్స్ క్లబ్ (ఎవరెస్ట్)హైదరాబాద్ అధ్యక్షులు జయకుమార్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు, సహ కోశాధికారి జిల్లా రవీందర్, సుబ్బయ్య, అర్వింద్‌కుమార్ తదితరులు జ్వరాలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా రూ.3 వేల నుంచి రూ.4,500 చొప్పున అందజేశారు. తాము సొంతంగా నిధులు సమీకరించుకుని జ్వరపీడిత కుటుంబాల్లో కొందరికి నగదు, కొందరు నిత్యావసర వస్తువులు, అవసరమైన వారికి మందులు అందజేస్తున్నట్లు సహ కోశాధికారి జిల్లా రవీందర్ తెలిపారు.

వినాయకచవితి ఏర్పాట్లపై కార్పొరేటర్ సమీక్ష

మౌలాలి:వర్షాకాలం నేపథ్యంలో వినాయక చవితి ఏర్పాట్లపై మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంజినీరింగ్ అధికారి మధురిమ, వాటర్‌వర్క్స్ అధికారి ఉదయ్, శానిటేషన్ అధికారులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు, లైన్‌మెన్‌లు, విద్యుత్‌లైన్‌మెన్‌లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, సీఎండీ ఇన్‌చార్జిలు కాలనీ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు. గత రెండేళ్లుగా మంజూరై ప్రారంభించని పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మొదలు పెడతామని అధికారులు చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు సాయిబాబా,మౌలాలి జనరల్ సెక్రటరీ శివగౌడ్, ప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

ప్రజావాణితో సత్వర పరిష్కారం



మేయర్ అమర్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్ ప్రజల నుంచి పిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 4 దరఖాస్తులు అందాయని, మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని మేయర్ అదికారులను ఆదేశించారు. కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్ సుదర్శన్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, టీపీఓ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం



రోడ్డు కొలత పనులను పరిశీలిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: ప్రధాన రహదారులను విస్తరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ నుంచి చెంగిచర్ల వెళ్లే ప్రధాన రహదారి, చెంగిచర్ల నుంచి బొల్లిగూడ రోడ్డు పనుల విస్తీర్ణత కొలతలను అధికారులు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ఆక్రమణలను తొలగించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.ఆక్రమణ పనులు పూర్తయిన తర్వాత రోడ్లు వేసి ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నాలో సీపీఎం శ్రేణులు

కాప్రా: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం ధర్నా చేపట్టింది. కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం నేతలు ధర్నా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో కేవలం ఉచితబస్సు తప్పా ఏ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా జీరో కరెంట్‌బిల్లు అందరికి వర్తించడంలేదని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ కూడా అమలు కావడంలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించలేదని, తక్షణమే వాటిని పరిశీలించి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం కాప్రా సర్కిల్ కార్యదర్శి శ్రీనివాసులు, సీహెచ్. ప్రసాద్, కేవీచారి, శివనారాయణ, వెంకట్, సఫియా, ఎంఎస్‌రావు, జీవీరావు, లక్ష్మీనారాయణ, సుభాషిణి, లావణ్య, వినోద, కళ, లక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నందికంటి శ్రీధర్‌కు శుభాకాంక్షల వెల్లువ



చిన్నారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



కాకూర్ వృద్ధాశ్రమంలో అల్పాహారం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

మల్కాజిగిరి: ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకల సందర్భంగా ఉప్పరిగూడలో వాత్సల్య సింధు నిరాశ్రిత వసతి గృహంలో చిన్నారులకు అన్నదానం చేశారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గుత్తి చందు, వంశీముదిరాజ్, వాసు, భాగ్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవిజ్ఞాన్ ఆటిజం స్కూల్‌లో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి అల్పాహారం అందజేశారు. ఎం.శ్రీనివాసులు, సూర్యప్రకాష్‌రెడ్డి, పవన్‌కుమార్, శంకర్, రామానుజన్, రాజు, హరి, సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో..

కౌకూర్‌లో అల్పాహారం..

ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నందికంటి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా కౌకూర్ వృద్ధాశ్రమంలో అల్పాహారం అందజేశారు.పవన్‌కుమార్, రాజు, మల్లేష్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, సతీష్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం



నాచారంలో నివాళులర్పిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు



సుభాష్‌నగర్‌లో..





అరుణోదయ వృద్ధాశ్రమంలో..



పంజాగుట్టలో సురేష్‌యాదవ్..



వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ నేతలు కొనియాడారు. సోమవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ఆర్ ప్రజలకు చేసిన సేవలు, అమలు పరిచిన పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు గుర్తు చేశారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం

సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న చిదానంద సరస్వతి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ ఆర్యసమాజ్, తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా 'ఇంటింటా యజ్ఞం- ప్రతీ ఇంటా యజ్ఞం' పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఉప్పల్ మహాత్మగాంధీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వానప్రస్థ దీక్షా గురువు నిగమ నీడం, గురుకుల ఆచార్యులు స్వామి చిదానంద సరస్వతి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మానవులంతా వైదిక ధర్మం వైపు మారాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మాన్ని రక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ అధ్యక్షుడు విఠల్‌రావు, బొల్ల విజయ్‌కుమార్, నర్సయ్య, సత్యకళ, మహేందర్, జయస్వాల్, పి.లక్ష్మణ్, ఆర్య సమాజ్ ఉప్పల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.15 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

ఉప్పల్: బంధువుల పుట్టినరోజుకు వెళ్లొచ్చేసరికి ఇంట్లోని నగదు మాయమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ విజయపురికాలనీకి చెందిన అచ్చుకట్ల అనిల్‌వాసు(29) ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈవెంట్‌లో వచ్చిన డబ్బులు రూ.15 లక్షలు ఇంట్లో బీరువాలో దాచాడు. గతనెల 31న సాయంత్రం ఇంటికి తాళం వేసి మన్నెగూడ ఫంక్షన్‌హాల్‌లోని బంధువుల పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగొచ్చి మరుసటి రోజు డబ్బులు చూసుకునేసరికి కనిపించ లేదు. దీంతో బాధితుడు ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాసాల మధ్య గోదాం.. నిర్వాహకులపై కేసు

అల్వాల్: మద్యం సేవించి కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం శ్రీసాయినగర్‌లో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన గోదాంలో కొందరు యువకులు తరుచూ మద్యం సేవించి గొడవకు దిగుతున్నారు. దీంతో సోమవారం కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గోదాం నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

కుషాయిగూడ: వినాయకచవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్ సూచించారు. చర్లపల్లి, ఈసీనగర్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం జరిగిన గణేష్ ఉత్సవాల నేపథ్యంలో చర్లపల్లి పోలీసులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వినాయక మండప నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని, భాగ్యనగర ఉత్సవ కమిటి ప్రతినిధులు పోలీసులకు సహకరించాలన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు శేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.